అర్హులైన ప్రతి నిర్వాసితునికీ న్యాయం

గ్రామసభలో స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్ జి.రామారావు

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సర్వం కోల్పోయి నిర్వాసితులవుతున్న అర్హులైన ప్రతి నిర్వాసితునికీ న్యాయం జరిగేలా చూస్తామని ఏలూరు స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్ జి.రామారావు హామీ ఇచ్చారు. ఇంటి విలువ పరిహారపు జాబితాలో తప్పిన నిర్వాసితుల ఆధారాల సేకరణకు శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. గతంలో జరిగిన సర్వేలో ఇంటి విలువ పరిహారపు జాబితాలో అధికారుల తప్పిదం వల్ల 116 మంది నిర్వాసితుల పేర్లు జాబితాలో లేకుండాపోయాయి. దీంతో నిర్వాసితులంతా తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆందోళన చేయడంతో మళ్లీ సర్వే నిర్వహించారు. సర్వే అనంతరం 116 మంది నిర్వాసితుల నుండి గ్రామసభ నిర్వహించిన అధికారులు వారి ఆధార్, రేషన్, గ్యాస్ పుస్తకం, కరెంటు బిల్లు, ఇంటిపన్ను తదితర ఆధారాలను పరిశీలించి దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎవిడిటి జి.రామారావు మాట్లాడారు. గ్రామసభలో ఆర్ఐ టి.వీరాస్వామి, విఆర్ఒ ఇబ్రహీం పాల్గొన్నారు.

పదిలో 22వ స్థానం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పది పరీక్షా ఫలితాల్లో ఏలూరు జిల్లా 64.35 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో 22వ స్థానం సాధించింది. ఏలూరుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు 597, 596 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం విశేషం. గతంలో పదో తరగతి ఫలితాల్లో రెండోస్థానం సాధించిన జిల్లా ఇప్పుడు 22వ స్థానానికి దిగజారడం సర్వత్రా చర్చనీయాంశమైంది. జిల్లాలో 22,259 మంది పది పరీక్షలకు హాజరవ్వగా 14,323 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ప్రథమ శ్రేణిలో 10576 మంది, ద్వితీయ శ్రేణిలో 2585 మంది, తృతీయ శ్రేణిలో 1162 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లావ్యాప్తంగా జెడ్‌పి హైస్కూళ్ల నుంచి 11046 మంది హాజరవ్వగా 5431 మంది ఉత్తీర్ణులయ్యారు. 49.17 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రయివేటు పాఠశాలల నుంచి 7382 మంది హాజరవ్వగా 6698 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరి ఉత్తీర్ణతా శాతం 90.73గా నమోదైంది. రెసిడెన్షియల్ పాఠశాలల నుండి 273 మంది, ఎయిడెడ్ నుండి 298 మంది, సోషల్ వెల్ఫేర్ నుండి 488 మంది, బిసి వెల్ఫేర్ నుండి 16 మంది, ప్రభుత్వ యాజమాన్యం నుంచి 182 మంది, కెజిబివి నుంచి 33 మంది, మున్సిపల్ పాఠశాలల నుండి 411 మంది, ట్రైబల్ వెల్ఫేర్ నుండి 139 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏలూరు నగరంలోని చైతన్య విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు 596కుపైగా మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఇక ఫెయిలైన విద్యార్థుల్లో ఎక్కువ మంది గణితంలో తప్పినట్లు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా గణితంలో 6773 మంది, సైన్స్‌లో 4658 మంది, సోషల్‌లో 2536 మంది ఫెయిలయ్యారు. ఒక సబ్జెక్టులో ఫెయిలైన వాళ్లు3,366 మంది ఉండగా ఆరు సబ్జెక్టుల్లో ఫెయిలైన వాళ్లు 514 మంది ఉన్నారు.

ఉపాధి పనులకు నిధుల కోత దారుణం

వ్యకాస యాత్రల్లో నేతలు

ప్రజాశక్తి - పెదవేగి

ఉపాధి హామీ పనులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో కోత విధించడం దారుణమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర మండలంలోని గోపన్నపాలెం, పెదవేగి, రాట్నాలకుంట, విజయరాయి, నడిపల్లి, రామచంద్రపురం, అయ్యపరాజుగూడెం గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా పనిదినాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ సంస్థలకు ఏటా లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలు, మినహాయింపులు వర్తింపజేసేందుకు వెనుకాడని మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీకి తగినన్ని నిధులు కేటాయించడానికి సుముఖంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఉపాధి హామీ పని దినాల సంఖ్యను 200 రోజులకు పెంచాలని, పనికోరే వారందరికీ పని కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి, దానికోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, నేతలు రాజశేఖర్, దాసు, పాల్గొన్నారు.

లింగపాలెం: ఉపాధి హామీ పనుల్లో సైట్ సూపర్‌వైజర్లను నియమించాలని, వారికి ఒక్కో ఉపాధి కూలికి రూ.ఐదు చొప్పున వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పరిరక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన యాత్ర శనివారం మండలంలోని అయ్యపరాజుగూడెం, కలరాయనిగూడెం, వెంకటాపురం, కాటంరెడ్డిపల్లి, ధర్మాజీగూడెం, మఠంగూడెం, సుందరాజుపేట, తోచిలక లింగపాలెం గ్రామాల మీదుగా సాగింది. గ్రామాల్లోని వ్యవసాయ కూలీలకు, ఉపాధి కూలీలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో 20 మందికి ఒక మేట్ (మేస్త్రి) ఉండేవారని, ఇప్పుడు మేట్ల వ్యవస్థను రద్దు చేశారని అన్నారు. 20 మంది గ్రూపును 50 మందికి పెంచి సైట్ సూపర్‌వైజర్లను నియమిస్తామని చెప్పినా ఇప్పటి వరకూ విధివిధానాలను సైతం ప్రకటించలేదన్నారు. దీంతో పని చేయించడం ఇతర పనులు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇబ్బందిగా మారిందన్నారు. మన రాష్ట్రంలో పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పనులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి ఈ నెల 12న ఏలూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పెద్దఎత్తున కూలీలు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవి, తుమ్మల సత్యనారాయణ, రాజశేఖర్, దాసు, వెంకటేశ్వర్లు, జ్యోతి పాల్గొన్నారు.

పెదవేగిలో..

వేలేరుపాడులో..

కుక్కునూరు: ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర శనివారం కుక్కునూరు చేరుకుంది. కొండపల్లి, మారేడుబాక, కివ్వాక, దాచారం, కిష్టారం, కొర్లకుంట, అరవపల్లి గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడారు. ఈ నెల 10న జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయంవద్ద జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో కూలీలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ యాత్రలో వ్యకాస జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు: ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర శనివారం వేలేరుపాడు మండలం వసంతవాడ చేరుకుంది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, నేత తామా ముత్యాలమ్మ మాట్లాడారు. రేపాకగొమ్ము, వేలేరుపాడు అంబేద్కర్ సెంటర్ మీదుగా యాత్ర సాగింది. కార్యక్రమంలో నేతలు కారం వెంకట్రావు, ధర్ముల రమేష్, మడివి దుర్గారావు, ఏసుబాబు, ప్రభాకర్, ప్రకాష్, రాంబాబు, నాగు, కిరణ్ చంటి పాల్గొన్నారు.

చింతలపూడి: నగర పంచాయతీలకు, పట్టణ ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించి ఉపాధి హామీ పనులను విస్తరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. చింతలపూడి ప్రాంతంలో చింతలపూడి, పాత చింతలపూడి, మల్లాయిగూడెం, శివాపురం తదితర గ్రామాల్లో యాత్ర సాగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ చింతలపూడి నగర పంచాయతీలో ఉపాధి పనులు చూపాలన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రమణరావు పాల్గొన్నారు.

పోలవరం: ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర పోలవరం చేరుకుంది. ఈ సందర్భంగా వ్యకాస నేత గుడెల్లి వెంకట్రావు మాట్లాడారు.

పోలసానిపల్లి పాలకవర్గ కృషి అభినందనీయం

రిజర్వాయర్ ప్రారంభోత్సవంలో ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - భీమడోలు

పోలసానిపల్లితోపాటు సమీప గ్రామాలకు నిరంతరం శుద్ధి చేసిన గోదావరి జలాలను తాగునీటిగా అందించేందుకు పోలసానిపల్లి పంచాయతీ పాలకవర్గం కృషి అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగంహసేన ఆధ్వర్యంలో గ్రామస్తుల చిరకాల కోరిక మేరకు శుద్ధి చేసిన గోదావరి జలాలను తాగునీటిగా నిరంతరం అందజేసేందుకు పదివేల లీటర్ల సామర్థ్యం గల గ్రౌండ్ లెవెల్ స్టోరేజ్ రిజర్వాయర్‌ను రూ.ఐదు లక్షలు పంచాయతీ నిధులతో నిర్మించారు. దీన్ని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు శనివారం ప్రారంభించారు. తొలి నీటి బిందెను సర్పంచితో కలిసి గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఎద్దడి శాశ్వత నివారణకు సర్పంచి చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఆర్‌అండ్‌బి రోడ్డు విస్తరణ సందర్భంగా పాడైపోయిన పైపులైన్ వ్యవస్థను రూ.20 లక్షలు జలజీవన్ మిషన్ నిధులతో పునర్నిర్మించి తాగునీటి సమస్యను పరిష్కారం చేశామన్నారు. సర్పంచి విజ్ఞప్తి మేరకు రూ.పది లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. వీటితో పైప్‌లైన్ల నిర్మాణం, మురుగునీటి పారుదల వ్యవస్థ క్రమబద్ధీకరణకు కల్వర్టుల నిర్మాణం జరిగాయన్నారు. ఆంజనేయనగరం ఆవాస ప్రాంతానికి మంజూరైన రూ.15 లక్షలు నిధులతో అక్కడ గోదావరి జలాలను తాగునీటిగా అందించేందుకు గ్రౌండ్ లెవెల్ స్టోరేజ్ రిజర్వాయర్, పైపులైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఉపాధి హామీ నిధులతో ఒక సాగునీటి చెరువును అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి అంబటి దేవి నాగేంద్రప్రసాద్, భీమడోలు సొసైటీ అధ్యక్షులు రాయపాటి సత్య శ్రీనివాస్, స్థానిక ప్రముఖులు షేక్ హసేన, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



నీటి బిందెను అందిస్తున్న ఎంఎల్ఎ

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి అవసరం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నిర్మూలించటానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తహశీల్దార్ ఎం.ఉదయ్‌భాస్కరరావు సూచించారు. సింహాద్రి అప్పారావుపేటలో నూజివీడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె.వాణి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే బాలికలకు వివాహం చేయాలని, బాల్యవివాహాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక అనర్థాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ నూరాణి, ఎసిడిపిఒ నాగేశ్వరీ, ఎఎన్ఎంఎస్, ఎన్‌జిఒ ప్రతినిధి జ్ఞానసెల్వి, సూపర్‌వైజర్ శివకుమారి, ఈదర పిహెచ్‌సి వైద్యులు నాగజ్యోత్స్న, నరేంద్ర, ఎంపిటిసి సభ్యులు నిర్మలకుమారి, ఉపసర్పంచి పద్మ, కిశోర బాలికలు, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

బిడిసి నిర్వాహకుల వేతనం పెంచాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా నియమితులై గ్రంథాలయ సంస్థలో పుస్తక నిక్షిప్త కేంద్ర (బిడిసి) నిర్వాహకులుగా 30 సంవత్సరాలుగా అతితక్కువ గౌరవవేతనంతో పనిచేస్తున్న వారికి కనీస వేతనం ఇవ్వాలని జిల్లా పుస్తక నిక్షిప్త కేంద్ర నిర్వాహకుల సమాఖ్య నాయకులు కోరారు. శనివారం 'మనం - మన గ్రంథాలయం' కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రంథాలయానికి విచ్చేసిన గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర ఛైర్మన్ మందపాటి శేషగిరిరావుకు సమాఖ్య సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిడిసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బిడిసిలు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారి, వేరే ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం తమకు ఒప్పంద ఉద్యోగుల జీతాల ప్రకారం రూ.15 వేలు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. అలాగే నిర్వాహకులుగా పనిచేస్తున్న వారందరికీ సంస్థ ద్వారా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, ఏడాదికి 15 రోజులు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని, బిడిసిలకు స్టేషనరీ గ్రేట్ రిజిష్టరు, అటెండెన్స్ రిజిష్టరు, పిరియాడికల్ రిజిష్టరు తదితర బిల్లులు మంజూరు చేయాలని, శాఖా గ్రంథాలయం నుండి పుస్తకాలు తీసుకురావడానికి ప్రయాణ ఖర్చులను మంజూరు చేయాలని కోరారు. బిడిసి నిర్వాహకుల సమస్యలపై ఛైర్మన్ శేషగిరిరావు సానుకూలంగా స్పందించారని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుల సమాఖ్య కోశాధికారి షేక్ షబ్బీర్, సభ్యులు సరెళ్ల ఆనందరావు, డి.శ్రీవిజయ, పి.మణికుమారి, ఎన్.రంగాచార్యులు, కె.హరినాధరాజు, ఇమామ్ సాహెబ్ పాల్గొన్నారు.

కేసుల రాజీకి సహకరించాలి

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 13వ తేదీన జరిగే జాతీయలోక్ అదాలత్‌లో 384 కేసులు రాజీయోగ్యమైనవిగా గుర్తించామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల శాశ్వత న్యాయ పీఠం ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి, డిఆర్ఒ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన శనివారం బీమా కంపెనీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో వాహన ప్రమాద కేసుల పరిష్కారంపై ఈసందర్భంగా చర్చించారు. అనంతరం సందర్భంగా జి.రాజేశ్వరి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 384 కేసుల వరకూ రాజీయోగ్యమైనవిగా గుర్తించామని, ఈ కేసుల్లో పిటిషనర్ న్యాయవాదులతో, పిటిషన్లతో సంప్రదించి కేసుల రాజీకి తగు కృషి చేయాలని సూచించారు. వాహన ప్రమాదాల కోసం ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీన ఎపిఎస్‌ఆర్‌టిసికి సంబంధించిన కేసులను, పదో తేదీన నేషనల్ బీమా కంపెనీకి సంబంధించిన కేసులకు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

అను విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - కలిదిండి

పది ఫలితాల్లో మూలలంక అను హైస్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ ఎస్‌వి.రాఘవయ్య తెలిపారు. ఎస్‌కె.అబ్దుల్ 486 మార్కులు, వి.యశ్వంతస్ 475, బి.మౌనిక 472, ఎం.హాసిని 433, ఎస్.భార్గవ్ 426 మార్కులు సాధించారన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడాభివృద్ధికి సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

కొల్లేరు లంక గ్రామాల్లో క్రీడాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు తెలిపారు. ఆగడాలలంకలో గ్రామ సర్పంచి భలే రాంబాబు, భీమడోలు ఎంపిపి కనుమాల రామయ్య చొరవతో దాతలు స్పందించి ఆగడాలలంకలో అన్ని సౌకర్యాలతో కూడిన వాలీబాల్ మినీస్టేడియం ఏర్పాటుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ఆట స్థలానికి ఎనిమిది సెంట్లు భూమిని రైతులు సమకూర్చగా, మినీ స్టేడియంలో రాత్రి సమయాలలో సైతం క్రీడలు నిర్వహించేందుకు రూ.ఏడు లక్షల విరాళాన్ని ఆక్వారంగ ప్రముఖులు ఇందుకూరి కృష్ణంరాజు (అర్థవరం కృష్ణంరాజు) అందజేశారు. వాలీబాల్ మినీ స్టేడియంను ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు శనివారం ప్రారంభించారు. లాంఛనంగా వాలీబాల్ సర్వీస్ చేసి ఆటలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. నూతనంగా నిర్మించిన మినీ స్టేడియం అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. ఎంపిపి కనుమాల రామయ్య మాట్లాడుతూ కొల్లేరు గ్రామాల్లో వాలీబాల్ క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. సర్పంచి సహకారంతో దాతలను సంప్రదించి వారి సహకారంతో వాలీబాల్ మినీ స్టేడియం ఆగడాలలంకలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భీమడోలు సొసైటీ అధ్యక్షులు రాయపాటి సత్యశ్రీనివాస్, వైసిపి ప్రముఖులు డాక్టర్ పి.మాన్‌సింగ్, రామకుర్తి నాగేశ్వరరావు, భీమడోలు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఇంజేటి నీలిమ, ఎంపిటిసిలు ముళ్లగిరి జాన్సన్, ఇంజేటి జూనియర్, గ్రామ సర్పంచి భలే రాంబాబు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న వాసుబాబు

గంజాయి రవాణాపై ఉక్కుపాదం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటిసారిగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో నేర సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఏలూరు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, పోలవరం, కైకలూరు, నూజివీడు సర్కిళ్ల పరిధిలో ఎస్ఇబి అధికారులతో సమీక్షించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, సూపరింటెండెంట్ అరుణకుమారి ఈ సమావేశంలో ఉన్నారు. గంజాయి రవాణా నిరోధానికి చేపట్టిన చర్యలు, అంతర్రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, కేసుల నమోదు, నిందితుల అరెస్టులు వంటి పలు అంశాలపై పూర్తిస్థాయిలో ఆరా తీశారు. విధి నిర్వహణలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే జిల్లాలో నాటుసారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే వారిని ఉపేక్షించేదిలేదని చెప్పారు. పలుమార్లు నాటుసారా కేసులు నమోదైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గంజాయి రవాణా అడ్డుకునేందుకు నిత్యం తనిఖీలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణా. విక్రయాలను అడ్డుకునేందుకు నిఘా మరింత పెంచాలన్నారు. గంజాయి వినియోగంతో అనర్థాలపై ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 14500పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కోర్టుల్లో విచారణలో ఉన్న కేసులపై అధికారులు శ్రద్ధ వహించాలని, నిందితులకు శిక్ష పడితేనే నేరాలకు పాల్పడేవారికి చట్టాల పట్ల భయం ఉంటుందన్నారు. ఎస్ఇబి అధికారులు చెక్‌పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని నిశితంగా పరిశీలిస్తూ అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. ఈ సమీక్షలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమరబాబు, ఎస్ఇబి సిఐ ప్రసాద్‌కుమార్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సిఐ కె.ధనరాజు, ఏలూరు ఎస్‌బి సిఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పదిలో మానస విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - భీమడోలు

పదో తరగతి ఫలితాల్లో భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. ఆరు ప్రభుత్వ పాఠశాలలు, ఒక అంబేద్కర్ గురుకులం, మూడు ప్రయివేటు పాఠశాలలకు చెందిన 812 మంది పరీక్షలు రాయగా 490 మంది (60 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక అంబేద్కర్ గురుకులంలో పరీక్షలు రాసిన వారిలో 45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రయివేటు పాఠశాలలకు సంబంధించి మానస పాఠశాల 99 శాతం, గుండుగొలను శ్రీవిద్యాలయ 97శాతం, భీమడోలు పాలేటి పాఠశాల 87శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండలస్థాయిలో మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.యామిని పరిణీత 589, అదే పాఠశాలకు చెందిన కె.శాంతి 587 మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. శ్రీవిద్యాలయ పాఠశాలకు చెందిన ఎ.భవ్య 585, కె.రాఘవ 583, పాలేటి పాఠశాలకు చెందిన ఎ.రమేష్ 565, ఎన్.శ్రేష్ఠ 515 మార్కులు సాధించి ఆయా పాఠశాలల ప్రథమ, ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 75శాతం ఉత్తీర్ణతతో ఆగడాలలంక, 12 శాతం ఉత్తీర్ణతతో ఎంఎం.పురం పాఠశాల మండలంలోని ప్రభుత్వ పాఠశాల స్థాయిలో ప్రథమ, చివరి స్థానాలను దక్కించుకున్నాయి. గుండుగొలను 47శాతం, పూళ్ల 44 శాతం, భీమడోలు 42 శాతం, కురెళ్లగూడెం 40 శాతం ఉత్తీర్ణత సాధించాయి. పోలసానిపల్లి అంబేద్కర్ గురుకులం విద్యార్థులు 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలస్థాయిలో అత్యధిక మార్కుల సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలను దక్కించుకొన్న ఎస్.యామిని పరిణీత, కె.శాంతిని పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ అభినందించారు. ఏకాగ్రత, పట్టుదలతో చదివిన మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు మండలస్థాయిలో ప్రత్యేకతను సాధించడం ఎంతోతృప్తినిచ్చిందని పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ తెలిపారు.

యామిని ప్రణీత

సాహితి

ధాన్యం సేకరణలో మిల్లర్ల తీరు దారుణం

శశిభూషణ్‌కుమార్‌కు ఎంఎల్ఎ ఫిర్యాదు

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం సేకరణలో మిల్లర్లు దారుణంగా వ్యవహరిస్తున్నారని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శశిభూషణకుమార్ దృష్టికి తెచ్చారు. శశిభూషణ్ కుమార్ జెసి లావణ్య వేణి, వ్యవసాయ శాఖ జెడి వై.రామకృష్ణతో కలిసి శనివారం స్థానిక రైతుభరోసా కేంద్రం నెంబర్-1ను సందర్శించారు. ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఉంగుటూరు ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడుతూ ధాన్యం సేకరణ విషయమై ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కస్టోడియన్ అధికారులు రైతులకు సహాయం చేయవలసి ఉండగా వారు మిల్లర్లతో కుమ్మక్కవుతున్నారని ఆరోపించారు. మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నా వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. కొన్నిచోట్ల లారీ కిరాయిలు రైతుల నుంచి వసూలు చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదని తెలిపారు. దీనిపై స్పందించిన శశిభూషణ్‌కుమార్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ ధాన్యం కొనుగోలు ప్రత్యేక అధికారి విజయరాజు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మంజు భార్గవి, డిఎస్ఒ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషారాజకుమారి, భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ

బిజెపి ప్రజ్యాతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బిజెపి అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై సిపిఐ కార్యకర్తలు సమరశీల పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, సిపిఐ జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం స్ఫూర్తి భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు కారం దారయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అక్కినేని వనజ మాట్లాడుతూ నిత్యావసర ధరలను నియంత్రించడంలో బిజెపి ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజల మధ్య మతవిద్వేషాలు రగిలించి, లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ మతోన్మాదాన్ని సృష్టించి మూడోసారి అధికారం కైవసం చేసుకోవడానికి బిజెపి ప్రయత్నిస్తుందని విమర్శించారు. అలాంటి ప్రయత్నాలను దేశ ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర జీవనాడి, ఆంధ్రుల హక్కుగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటుపరం చేసి రాష్ట్రాన్ని మరింత కష్టాలపాల్జేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయంపై అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు పోరాడాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న నష్టాన్ని ప్రశ్నించకుండా, పోరాడకుండా వైసిపి, టిడిపి, జనసేన బిజెపితో దోస్తీ చేస్తే రాష్ట్ర ప్రజానీకం క్షమించదని ఆమె పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ గతనెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకూ జిల్లాలో సిపిఐ, సిపిఎం నిర్వహించిన ప్రచార భేరియాత్రను వివరించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎమ్‌డి మునీర్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - ముసునూరు

వైసిపి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి క్షీణించిందని టిడిపి నేత మాజీమంత్రి సూర్యారావు, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరావు విమర్శించారు. శనివారం మండలంలోని కాట్రేనిపాడులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి రాగానే ప్రజావ్యతిరేక పాలన సాగిస్తూ ముందుకుసాగుతున్నారన్నారు. ధరల అదుపులో విఫలమయ్యారని విమర్శించారు. ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి పాలన అవినీతిమయమైందన్నారు. ఇసుక, మట్టి మాఫియా చేసుకుంటూ ప్రజాధనం వృధా చేసుకుంటూ ఎన్నో అక్రమాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలను ఎన్నో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, సర్పంచి గద్దల సుహాసిని మోహన్‌రావు, ఎంపిటిసి సభ్యులు సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు వీరే..

లిటిల్‌బడ్స్ విద్యార్థుల హవా

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు లిటిల్ బడ్స్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. మొత్తం 167 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. అత్యధికంగా జివిఎ.అభిషేక్ 600 మార్కులకు గాను 582 మార్కులు సాధించారు. ఆ తర్వాత టి.మేఘన 573 మార్కులు సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

టి.మేఘన

అభిషేక్ కుమార్

న్యూజనరేషన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు

పది ఫలితాల్లో ఏలూరు న్యూజనరేషన్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. మొత్తం 28 మంది పరీక్షలు రాయగా 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. డి.పావని 522 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌ఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ అభినందించారు.

పావని

శ్రీదీప్తి విజయదుందుభి

ప్రజాశక్తి - ఏలూరు

పదో తరగతి ఫలితాల్లో శ్రీదీప్తి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. కె.నిఖిల్‌సాయి 561 మార్కులతో స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఆ తర్వాత టి.తేజశ్రీ 556 మార్కులు, జె.జస్వంత్‌కుమార్ 552, జె.సాయిరాకేష్ 550 మార్కులు సాధించారు. 28 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని స్కూల్ కరస్పాండెంట్ ఎల్.గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

నిఖిల్ సాయి

లిటిల్ ఫ్లవర్ విజయఢంకా

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని లిటిల్‌ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల నుంచి 64 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 64 మంది ఉత్తీర్ణత సాధించారు. జె.రవికిరణ్ 586 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ బలుసు రఘురామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

జె.రవికిరణ్

పూజిత

వెంకటలక్ష్మి

భావన

మహేశ్వరి

ఉంగుటూరులో 52.83 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ఉంగుటూరు

పదో తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు 52.83 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలు, నాలుగు ప్రయివేటు పాఠశాలల్లో 738 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 369 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 166, బాలికలు 203 మంది ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్‌గా గొల్లగూడెం సూర్య పాఠశాల విద్యార్థి చాట్రాది భావన 589 మార్కులతో నిలిచింది. పాఠశాలల వారీగా గొల్లగూడెం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇల్లిందల గాయత్రి 523 మార్కులు, ఉంగుటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి మాగంటి కీర్తన 562, నారాయణపురం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి ఆకుల రమ్యశ్రీసత్య 556 మార్కులు, బొమ్మిడి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి బంటుమిల్లి కీర్తన 525, కాగుపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల ఇజ్జా రవివెంకటకిరణ్ 524, నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి పెదవేగి వెంకటకృష్ణ 536, కైకరం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి కె.శ్రీమల్లేశ్వరి 545, రాచూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి జి.శ్రావణి 390, వేల్పూరు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి సిహెచ్.వైశాలి 441, కార్మెల్ చేబ్రోలు పాఠశాల విద్యార్థి జి.జ్యోతిశ్రీ 572, ఉషోదయ ఉన్నత పాఠశాల విద్యార్థి సూర పూజిత 564 మార్కులు సాధించి ఆయా పాఠశాలల టాపర్లుగా నిలిచారు.

సూర్య విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - ఉంగుటూరు

పదో తరగతి ఫలితాల్లో గొల్లగూడెం సూర్య పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నూటికి 91 శాతం ఉత్తీర్ణత సాధించి మండల ప్రథమ స్థానం సాధించడం సంతోషంగా ఉందని పాఠశాల ప్రిన్సిపల్ వేముంపల్లి చైతన్యకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో 34 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 31 మంది ఉత్తీర్ణులయ్యారు. 550 మార్కులు సాధించిన వారు 10 మంది, 530 పైబడి మార్కులు సాధించిన వారు 16 మంది, 490 నుంచి 529 మధ్య మార్కులు సాధించిన వారు ఐదుగురు విద్యార్థులున్నారు.

ట్రిపుల్‌ఐటిలో సీటు సాధిస్తా
- చాట్రాది భావన, మండల టాపర్

మాది యర్రమిల్లిపాడు. నాన్న నాగేశ్వరరావు రైతు. తల్లి నాగలక్ష్మి గృహిణి. ట్రిపుల్ ఐటిలో సీటు సాధించి ఉన్నత శిఖరాన్ని చేరుకోవాలనే పట్టుదలతో, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చదివి మంచి మార్కులు సాధించాను.


ఉత్తమ మార్కులు సాధించిన శశి విద్యార్థులు

శశి విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక శశి హై స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ జివి.సత్యనారాయణరాజు తెలిపారు. రుద్రపాక వసంతశ్రీ 584/600 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే నిమ్మకూరు వాసవీదుర్గ 560 మార్కులు, జి.జయదీప్ 544, అబ్దుల్ షరీఫున్నీసా 541 మార్కులతో ముందంజలో ఉన్నారన్నారు. మరో పది మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించిన వారిలో ఉన్నారన్నారు. మిగిలిన విద్యార్థులందరూ 450కి పైగా మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను, విద్యార్థులను కరస్పాండెంట్ జివి.సత్యనారాయణరాజు అభినందించారు.

ఇండో-సాక్సన్ విజయభేరి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ఇండోసాక్సన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయభేరి మోగించారు. 21 మంది పరీక్షలకు హాజరుకాగా 21 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎంజె.జార్జి తెలిపారు. పాఠశాలకు చెందిన కురికెట్ల శేషసాయిశివలిఖిత 576 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానం సాధించినట్లు జార్జి తెలిపారు.

శేషసాయి-శివలిఖిత

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కలిదిండి పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక కలిదిండి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తాచాటారని స్కూల్ కరస్పాండెంట్ సానా మీనా సరస్వతి తెలిపారు. ఆనంద్ కుమార్ 600 మార్కులకు గాను 583 మార్కులు, కె.ఈశ్వరకీర్తి 572 మార్కులు, డి.వల్లవి 553 మార్కులు, బి.ప్రమీల 539, అనుశ్రమ్ 509 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. 500కు పైగా మార్కులు 12 మంది విద్యార్థులు సాధించారు. విద్యార్థులను సానా మీనా సరస్వతి ప్రత్యేకంగా అభినందించారు.

గురుకుల పాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని నాగిరెడ్డిగూడెం బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి పి.సౌజన్య పదో తరగతి ఫలితాల్లో అత్యధికంగా 582 మార్కులు సాధించింది. రాఘవాపురం ప్రభుత్వ పాఠశాలకు చెందిన అద్దూరి జయ స్పందన 579 మార్కులు సాధించింది. సుబ్బారాజు ప్రభుత్వ హైస్కూల్‌కు అభినేని యువకిషోర్ 522, సీతానగరం ప్రభుత్వ పాఠశాలకు చెందిన పసుపులేటి అనిల్ 522 మార్కులు సాధించారు. మండలంలో 796 మంది పరీక్షలకు హాజరుకాగా 460 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ రామారావు తెలిపారు.

శ్రీచైతన్య టెక్నో విద్యార్థికి రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు

మండలంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థి ఎం.మోక్షిత పది ఫలితాల్లో 600 మార్కులకు 596 సాధించి రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోక్షితను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

మోక్షిత

కుక్కునూరులో 43 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని ఏడు ప్రభుత్వ హై స్కూళ్లు, లిటిల్ స్టార్ ప్రయివేట్ హైస్కూలు విద్యార్థులు కలిపి మొత్తం 284 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 121 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 43 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అమరవరం హైస్కూలు విద్యార్థి జూపల్లి ప్రణతి 563 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. కుక్కునూరు లిటిల్ స్టార్ హైస్కూల్‌కు చెందిన ఎస్.రక్షిత 532 మార్కులతో మండల ద్వితీయ స్థానం సాధించిందని ఎంఇఒ బాబూరావు తెలిపారు.

ద్వారకాతిరుమలలో 65.86 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

పదో తరగతి ఫలితాల్లో మండలంలో విద్యార్థులు 65.86 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ అన్నమ్మ తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు మొత్తం 577 మంది పరీక్షలు రాశారని, వీరిలో 380 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రాళ్లకుంట సెయింట్ జేవియర్ స్కూల్, తిమ్మాపురం ఉషోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

అప్పలరాజుగూడెం గురుకుల విద్యార్థుల హవా

ప్రజాశక్తి - టి.నరసాపురం

పదోతరగతి ఫలితాల్లో అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాల విద్యార్థి గుండుమోగుల గణేష్ అంజనాసాయి 581 మార్కులు సాధించి మండల మొదటి స్థానంలో నిలిచాడు. అదే పాఠశాలకు చెందిన గుబ్బల్లి వెంకటకుమార్ 577 మార్కులతో రెండో స్థానంలో నిలిచారు. టి.నరసాపురం, బొర్రంపాలెం, మక్కినవారిగూడెం, కేతవరం, మర్రిగూడెం, అప్పలరాజుగూడెం పాఠశాలల ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులు మొత్తం 469 మంది హాజరయ్యారని, వీరిలో 258 మంది (55 శాతం) ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ టి.రామ్మూర్తి తెలిపారు. అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల 99 శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు.

వెంకటకుమార్

అంజనాసాయి

ముసునూరు విద్యార్థుల ఫలితాలివే..

ప్రజాశక్తి - ముసునూరు

స్థానిక గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులు 77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ యార్లగడ్డ శ్రీదేవి తెలిపారు. అలాగే ముసునూరు హైస్కూల్ 56 శాతం, చెక్కపల్లి చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల 95 శాతం, ముసునూరు భారతీ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు 89 శాతం ఉత్తీర్ణత సాధించారు. గోపవరం హైస్కూల్ విద్యార్థులు 42 శాతం, వేల్పుచర్ల హైస్కూల్ 65 శాతం, రమణక్కపేట హైస్కూల్ విద్యార్థులు 53 శాతం ఉత్తీర్ణత సాధించారు.

పోలవరంలో విజేతలు వీరే..

ప్రజాశక్తి - పోలవరం

పదో తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు విజయభేరి మోగించారు. పోలవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎస్‌కె.ఇర్ఫాన్ అలీ 573/600, పోతుల రాముడు 573/600 అత్యధిక మార్కులు సాధించారు. ఆ తర్వాత గూటాల మహాదేవ ప్రయివేటు స్కూల్‌కు చెందిన గేదెల యశ్విత 563, సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి శ్రీకోష్టుదేవి 560, కొరిటంటి యశ్విని జ్యోతి స్వరూప్ 557, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పోతుల లక్ష్మణుడు556, గూటాల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి మారుముఖం సత్య 513, కొరటూరు నాగవినోత్న 489 మార్కులు సాధించారు. పట్టిసీమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తోట శ్రావణి 514, గంగుల రమ్యశ్రీ 473, చేగొండపల్లి గిరిజన బాలుర ఉన్నత పాఠశాలలో సిహెచ్.ఉజాది 472, కరిని అభిలాష్ 462, ఇటుకలకోట గిరిజన బాలుర ఉన్నత పాఠశాలలో సిహెచ్.సంతోష్ రెడ్డి 394, పాయం లక్ష్మీ శ్రీ వర్జన్ బాబు 291, కుంకాల గిరిజన బాలుర ఉన్నత పాఠశాలలో కోటం కృష్ణవంశీ 425, పూనెం నాని కిరణ్ 367, బోడిగూడెం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో పైదా లావణ్య 491, సంకురు అశ్విని 444, శ్రీసాయి ఇంగ్లీష్ మీడియం పెద్దింటి నవ్య సత్యశ్రీ 554, పూనెం గీతా వినీత 543, గూటాల మహాదేవ హైస్కూల్ విద్యార్థి గేదెల యశ్విత 563, సర్రా దుర్గా సౌమ్యశ్రీ 510, మార్కులు సాధించారు.

కలిదిండిలో 46.11 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుండి 623 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 46.11 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ కొల్లాటి నరేష్ కుమార్ తెలిపారు. వారిలో బాలురు 303 మందికి గాను 39.07 శాతం, బాలికలు 320మందికి గాను 53.14 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 36.46 శాతం, చినతాడేపల్లి(పిపి)లో 45.33 శాతం, తాడినాడలో 55.74 శాతం, కోరుకొల్లులో 37.77 శాతం, కలిదిండిలో 53.34 శాతం, గుర్వాయిపాలెంలో 29.86 శాతం, కొండంగిలో 56.41 శాతం, భాస్కరరావు పేటలో 55.90 శాతం, పెదలంకలో 44.14 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కొల్లి రిషిత 576 మార్కులు, భాస్కరరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి.సాయిదేవి 576 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచారు.

జీలుగుమిల్లిలో 58శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పది ఫలితాల్లో మండల విద్యార్థులు 58 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ కె.శ్రీనివాస్ తెలిపారు. మండలంలో మొత్తం 356 మంది పరీక్షలు రాశారు. వీరిలో 205 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బాలురు 110 మంది, బాలికలు 95 మంది ఉత్తీర్ణత సాధించారు. జీలుగుమిల్లి హైస్కూల్ విద్యార్థిని లక్ష్మీప్రసన్న 583 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

కైకలూరులో ప్రతిభా విద్యార్థులు వీరే..

ప్రజాశక్తి - కైకలూరు

పదో తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మొత్తం 818 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 525 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 78 నమోదైంది. భుజబలపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన పి.సాయికోష్ 565 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. అలాగే ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులతో సత్తాచాటారు. ఆటపాకలోని క్రైస్తవ పాఠశాలకు చెందిన విద్యార్థిని 593 మార్కులతో మండల ఫస్ట్ సాధించింది. టివిఎస్‌ఆర్‌ఎం నేషనల్ పాఠశాలకు చెందిన పి.సత్యసాహితి, డి.ప్రశాంతి 589 మార్కులతో రెండోస్థానం, విజ్ఞాన్ కాన్సెప్ట్ స్కూల్‌కు చెందిన సిహెచ్.స్వాతిక 586 మార్కులు సాధించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంఇఒ డి.రామారావు అభినందించారు.



గ్రామసభలో అధికారులను కోరుతున్న గ్రామస్తులు

ఉపాధి పనులు చూపండి

గ్రామసభలో అధికారుల వద్ద ప్రజల మొర

ప్రజాశక్తి - ముసునూరు

పనుల్లేక ఇబ్బందులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ఉపాధి పనులు చూపాలని అధికారుల సూరేపల్లి గ్రామస్తులు వాపోయారు. శనివారం మండలంలోని సూరేపల్లిలో ఎంపిడిఒ జి.రాణి, ఉపాధి హామీ మండల శాఖ అధికారులతో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని పేద, బడుగు, బలహీనవర్గాల వారందరూ కలిసి తమ గ్రామంలో ఉపాధి పనులు చూపాలని, నెల రోజుల నుండి పనుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారుల ముందు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

రేషన్ బియ్యం పట్టివేత

ముసునూరు:అక్రమంగా నిల్వ ఉంచిన 1450 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని నూజివీడు డివిజన్ సివిల్ సప్లయిస్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సూరేపల్లిలో ఒబిలిసెట్టి రామకృష్ణ ఇంటి వద్ద సుమారు 1450 కేజీల రేషన్ బియ్యం నిల్వచేసి ఉండటంతో తమ సిబ్బందితో దాడిచేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చాట్రాయిలో 'పది' విజేతలు వీరే..

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలో పదో తరగతి పరీక్షలు రాసిన 374 మందిలో 218 మంది ఉత్తీర్ణత సాధించారు. చనుబండ పాఠశాల విద్యార్థి బి.ప్రవలిక 535 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. చిన్నంపేట పాఠశాల విద్యార్థి శివజాలు 572, చాట్రాయి పాఠశాలలో రాకేష్‌కుమార్ 554, పోలవరం పాఠశాల విద్యార్థి స్వప్న 563, మర్లపాలెం పాఠశాల విద్యార్థి జి.పావని 513, చిత్తాపూరులో బి.వీరాగ్ర శ్రీలక్ష్మి 554, సి.గుడిపాడులో బి.దివ్య 515 మార్కులతో ఆయా స్కూళ్లలో టాపర్లుగా నిలిచారు. చనుబండలోని ఉషోదయ ప్రయివేట్ స్కూల్లో 31 మందికి 27 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ ఎ.విజయలక్ష్మి 581 మార్కులతో టాపర్‌గా నిలిచారు. చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్లో 21 మంది విద్యార్థులకు 20 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇక్కడ వెలిశాల నందకిషోర్ 580 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచారు. చాట్రాయి విజన్ పబ్లిక్ స్కూల్లో 37కి 35 మంది విద్యార్థులు పాసయ్యారు. ఇక్కడ 574 మార్కులతో పి.చందు స్కూల్ టాపర్‌గా నిలిచారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎంఇఒ బి.వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

ప్రసూష

అమూల్య

మహాలక్ష్మి

క్రాంతి హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కలిదిండి

కోరుకొల్లు క్రాంతి హైస్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ చెన్నంశెట్టి కృష్ణ తెలిపారు. మొత్తం 15 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 14 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 555 మార్కులతో జె.అమూల్య, 549 మార్కులతో సిహెచ్.ప్రసూష, 531 మార్కులతో వి.శ్రీమహాలక్ష్మి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ముందువరుసలో నిలిచారన్నారు. మరో తొమ్మిది మంది 400కు పైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి కరస్పాండెంట్ కృష్ణ అభినందనలు తెలిపారు.

ఎ లిటిల్‌ఫ్లవర్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెనుమల్లి ఎ లిటిల్‌ఫ్లవర్ ది లీడర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల నుంచి 34 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. వీరిలో పాఠశాలలో 569 మార్కులతో ఎ.తరుణ్‌సాయి ప్రథమ స్థానం సాధించగా, ఎం.జగదీష్ 568 మార్కులతో ద్వితీయ స్థానం, 564 మార్కులతో పి.యాశ్విక్ తృతీయస్థానం సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపల్ జాఫర్ తెలిపారు.

సమీర

త్రిష

ఉష

సహాయమాత విజయకేతనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక సహాయమాత ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. పాఠశాల నుంచి 55 మంది పరీక్షలు రాయగా, వారిలో 52 మంది మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో ఎమ్‌డి సమీర 578 మార్కులతో ప్రథమ స్థానం, గండేపల్లి త్రిష 573 మార్కులతో ద్వితీయస్థానం, కర్ర ఉష 563 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ సిస్టర్ రోస్మి సిస్టర్ లిన్సా తెలిపారు.

బుట్టాయగూడెంలో 56 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పదో తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు 56.87 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ తెల్లం బాబూరావు తెలిపారు. మండలంలో మొత్తం 684 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, వీరిలో బాలురు 157 మంది బాలికలు 232 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బుట్టాయగూడెం విద్యాజ్యోతి ప్రయివేటు పాఠశాల విద్యార్థి పి.జ్ఞానశ్రీ సత్యసాయి 567, మదేపల్లి హేమభారతి 566, సెయింట్ జోసఫ్ హైస్కూల్ వందిరిమామిడిగూడెనికి చెందిన కొవ్వాసి యశ్వంత్ 562, యడారా ఉదయశ్రీ 562 మార్కులతో మండలంలో ప్రతిభ చాటారు.

MUNICIPAL CORPORATION, ELURU
e-PROCUREMENT TENDER NOTICE No: 73-82/CMDF-Grant, GGMP-Grant, GGMP-Mpl. Funds & General / 2023-24, Dated. 5-5-2023
The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from from interested, eligible bidders for "Construction of Multipurpose Community Halls, Renovation of URDU Ghar, Shadi Khana, Desilting of Drain, Supply Delivery Commissioning and Testing of Decorative Poles with Luminaries, Construction of Toilets, Construction of CC Road and Drain at various places in Municipal Corporation, Eluru" Total No. of works is 10 with an amount of Rs. 102.41 Lakhs. Tender schedules are available on e-procurement market place from 09-05-2023. Last date of receipt of tenders is 15-05-2023. Further details can be seen at e-procurement market place at www.apeprocurement.gov.in or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).
Sd/- COMMISSIONER
MUNICIPAL CORPORATION, ELURU

దస్తావేజులు పోయినవి
ప్రస్తుతం ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, వేగివాడ కాపురస్తులైన నిమ్మాది అశోక్, S/o. సూరిరావు అను నాకు పెదవేగి మండలం, వేగివాడ గ్రామ పరిధిలో డాక్యుమెంట్ నెం. 1069/2014, దీని లింక్ డాక్యుమెంట్ నెం. 1367/2008 అను నెంబరు గల ఒరిజినల్ లింకు దస్తావేజు ది. 15-03-2023వ తేదీన నేను ఇల్లు మారుతున్న సమయంలో ఎక్కడో పడిపోయినది. కావున సదరు ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 1367/2008 దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
నిమ్మాది అశోక్, S/o. సూరిరావు
వేగివాడ, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా
సెల్: 9948543177

In the Court of the Hon'ble Additional Judicial of 1st Class Magistrate, Tadepalligudem
C.C. 103/22
Between:
1. Sri Koneru Vidyadhara Rao ...Petitioner/ Complaint
AND
1. Smt Pilli @ Bethala Uma Devi ...Respondent/ Accused
పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్/Accuses అయిన Smt Bethala @ Umadevi, W/o. B.Koteswara Rao, Hindu, Female, age 58, Plot No. 201, M.D.R. Apartment, M.D.R Constructions, Chennakesavula Rangarao Veedhi, Sanivarapu peta, Gavaravaram, Eluru - 534003, A.P. అను వారికి నోటీసులు అమలు కొరకు ది. 11-05-2023వ వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల మీ పరోక్షముగ కేసు విచారణ తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
MAKA SRINIVASA RAO
ఏలూరు Advocate, Tadepalligudem
ది.06-5-23 Cell: 9848027863

మహారాజశ్రీ భీమవరం IIIrd Additional District and Sessions జడ్జి వారి కోర్టులో
I.A. No. 491/2021 in
I.A. No. 884/2018 in
O.S. No. 55/2018
పిటీషనర్లు/వాదులు: బాలపాటి ప్రదీప్‌కుమార్, వగైరా
రెస్పాండెంట్లు/ప్రతివాదులు: బాలపాటి కరుణమ్మ (died) వగైరా
R-5 Address: దార్ల ప్రభావతి, W/o. సంజీవరావు, క్రిస్టియన్, వయస్సు 60 సం॥లు, వృద్ధాప్యం, R/o. D.No. 2-82, చినపేట, ఏలూరుపాడు, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా, BJCJC.
పై నంబరు I.A. లో మీకు జారీ కావలసిన నోటీసులు చాలా పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్డు పోస్టు ద్వారాను పంపించినప్పటికి మీరు తీసుకొనక Avoid చేసినందున ది. 12-5-2023వ తేదీన ఉదయం 10 గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.
PODUGU SRINIVASA RAO
PODUGU ANURADHA
PODUGU SAI HARIKESH
భీమవరం Advocates, Bhimavaram
02-5-2023 Cell: 9849154471

మహారాజశ్రీ భీమవరం IIIrd Additional District and Sessions జడ్జి వారి కోర్టులో
I.A. No. 488/2021 in
O.S. No. 55/2018
పిటీషనర్లు/వాదులు: బాలపాటి ప్రదీప్‌కుమార్, వగైరా
రెస్పాండెంట్లు/ప్రతివాదులు: బాలపాటి కరుణమ్మ (died) వగైరా
R-5 Address: దార్ల ప్రభావతి, W/o. సంజీవరావు, క్రిస్టియన్, వయస్సు 60 సం॥లు, వృద్ధాప్యం, R/o. D.No. 2-82, చినపేట, ఏలూరుపాడు, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా, BJCJC.
పై నంబరు I.A. లో మీకు జారీ కావలసిన నోటీసులు చాలా పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్డు పోస్టు ద్వారాను పంపించినప్పటికి మీరు తీసుకొనక Avoid చేసినందున ది. 12-5-2023వ తేదీన ఉదయం 10 గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.
PODUGU SRINIVASA RAO
PODUGU ANURADHA
PODUGU SAI HARIKESH
భీమవరం Advocates, Bhimavaram
02-5-2023 Cell: 9849154471

మహారాజశ్రీ భీమవరం IInd Additional District and Sessions జడ్జి వారి కోర్టులో
I.A. No. 494/2021 in
I.A. No. 885/2018 in
O.S. No. 55/2018
పిటీషనర్లు/వాదులు: బాలపాటి ప్రదీప్‌కుమార్, వగైరా
రెస్పాండెంట్లు/ప్రతివాదులు: బాలపాటి కరుణమ్మ (died) వగైరా
R-5 Address: దార్ల ప్రభావతి, W/o. సంజీవరావు, క్రిస్టియన్, వయస్సు 60 సం॥లు, వృద్ధాప్యం, R/o. D.No. 2-82, చినపేట, ఏలూరుపాడు, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా, BJCJC.
పై నంబరు I.A. లో మీకు జారీ కావలసిన నోటీసులు చాలా పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్డు పోస్టు ద్వారాను పంపించినప్పటికి మీరు తీసుకొనక Avoid చేసినందున ది. 12-5-2023వ తేదీన ఉదయం 10 గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును ఇందుమూలంగా మీకు తెలియజేయడమైనది.
PODUGU SRINIVASA RAO
PODUGU ANURADHA
PODUGU SAI HARIKESH
భీమవరం Advocates, Bhimavaram
02-5-2023 Cell: 9849154471